నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శనివారం 11 జనవరి 2025 | NALGONDA

నేడు నల్లగొండలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ సిటీ, జనవరి 10 : జిల్లా కేంద్రం పరిధిలో ఎస్ఎల్‌బీసీలోని 11కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనునలు, కతాల్ గూడ పరిధిలోని 11కేవీ విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్న దృష్ట్యా శనివారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నల్లగొండలోని సాగర్‌రోడ్డు, మధురాపురికాలనీ, భాగ్యనగర్ కాలనీ, చైతన్యపురి కాలనీ, మారుతి నగర్, ఇంద్రారెడ్డి రైస్‌మిల్, వెంకటరమణ కాలనీ, రూబీ కాలనీ, సూర్యవంశీ కాలనీ, పీటీఆర్ కాలనీ, వసుంధర కాలనీ, కనకదుర్గ కాలనీ, శాస్త్రీనగర్, నీలగిరి కాలనీ రోడ్డు, తెలంగాణ కాలనీ, అక్కలాయిగూడెం, గంధవారి గూడెం, చింతబావిగూడెం, గణేశ్‌నగర్, లెప్రసీ కాలనీ ముత్యాలమ్మ కాలనీ, సాయిన గర్, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, ఎస్ఆర్ టీఎస్‌టీ ఇంజినీర్ కాలేజీ, రుద్రమదేవి కాలనీ, హిమగిరి కాలనీ, గోకుల్ నగర్, బ్లూహిల్స్, రూరల్ పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ ఆఫీస్ ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు నల్లగొండలో బీఆర్ఎస్ రైతు మహాధర్నా

హాజరుకానున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- క్లాక్‌టవర్ సెంటర్‌లో నిర్వహణకు ఏర్పాట్లు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో సన్నాహాలు
- పార్టీ శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా చర్యలు

కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలతోపాటు రైతు రుణమాఫీ, రైతుభరోసా మోసాలపై బీఆర్ఎస్ పార్టీ పోరాటానికి సిద్ధమైంది. ఇప్పటికే రైతు భరోసా కుదింపుపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు కొద్దిరోజులుగా ఆగ్రహంతో రోడ్లపైకి వస్తున్నారు. రైతుల ఆందోళన, ఆవేదనకు మద్దతుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ రంగంలోకి దిగుతున్నారు. ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నీ తూ.చ. తప్పకుండా అమలు చేయాలన్న డిమాండ్‌తో ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు మహాధర్నాకు పిలుపునిచ్చారు. ఈ రైతు మహాధర్నాకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో మహాధర్నాకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

– నల్లగొండ ప్రతినిధి, జనవరి 10 (నమస్తే తెలంగాణ)

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం కేసీఆర్ ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ రంగంలో అత్యధిక లబ్ధి పొందిన జిల్లా నల్లగొండనే అవడం విశేషం. ఉచిత విద్యుత్ వినియోగం, సాగునీటి రంగం, రైతుబంధు లబ్ధిలోనూ నల్లగొండకు అత్యధిక ప్రయోజనం చేకూరింది. అందుకే సమైఖ్య పాలనలో ఉమ్మడి జిల్లాలో 13 లక్షల ఎకరాల సాగు భూమి ఉంటే కేసీఆర్ హయాంలో అది 23 లక్షల ఎకరాలకు చేరింది. అలా పంటల దిగుబడిలోనూ అగ్రస్థానంలో నిలిచింది. ముఖ్యంగా ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే నల్లగొండ జిల్లా ప్రముఖ స్థానంలో నిలిచింది. కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని పండుగలా మార్చి చూపితే ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయాన్ని తిరిగి కుదేలు చేసే ప్రయత్నాలు చేస్తున్నది. రుణమాఫీ అమలు, రైతుభరోసా డబ్బుల్లోనూ ప్రభుత్వ విధానాలతో తీరని అన్యాయం జరుగుతున్నది. రెండు లక్షల రూపాయల రుణమాఫీ కోసం నేటికీ ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల మందికిపైగా రైతులు ఎదురుచూస్తున్నారు. రైతుభరోసా ద్వారా ఉమ్మడి జిల్లాలో 25 లక్షల మంది రైతులకు ఒక్క సీజన్‌లోనే ఎకరాకు రూ.7,500 చొప్పున పెట్టబడి సాయం అందిస్తే సుమారు రూ.1,950 కోట్ల లబ్ధి రైతులకు జరగాల్సి ఉంది. కానీ దాన్ని ఆరు వేలకు కుదించడం వల్ల ఆ లబ్ధి రూ.1,300 కోట్లు కూడా దాటేలా లేదు. గత యాసంగిలో ఎకరం మీద రూ.2,500 కోత, వానకాలంలో మొత్తంగా రూ.7,500కి ఎసరు, ప్రస్తుత సీజన్‌లో సైతం ఎకరాకు రూ.1,500 కోత పెట్టడం వల్ల మొత్తంగా 11,500 రూపాయలను ఒక్కో ఎకరంపైన రైతు పెట్టుబడి సాయాన్ని కోల్పోతున్నాడు. మొత్తంగా చూస్తే సుమారు 3 వేల కోట్ల రూపాయల రైతు భరోసాకు కాంగ్రెస్ సర్కార్ ఎసరు పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా రైతులు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రోడ్లెక్కి ఆందోళనకు దిగారు. ఎన్నికల హామీ, వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకారం ఎకరాకు రూ.7,500 రైతుభరోసా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రైతుల ఆవేదనను అర్థం చేసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రంగంలోకి దిగుతున్నారు. రైతుభరోసా మోసంపై నల్లగొండ వేదికగా రాష్ట్రంలోనే తొలి రైతు మహాధర్నాలో కేటీఆర్ పాల్గొననున్నారు. నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో వేలాది మంది రైతులతో ఆదివారం ఉదయం 10 గంటలకు రైతు మహాధర్నాకు పార్టీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ ముఖ్యులంతా మహా ధర్నా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శుక్రవారం సాయంత్రం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ మహాధర్నా అనుమతి కోసం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డికి దరఖాస్తు అందజేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. మరోవైపు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలందరితో చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహంతో ఉన్న రైతులు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, అందుకు కావాల్సిన సహకారం పార్టీ శ్రేణులు అందించాలని సూచించారు. రైతులు కూడా పెద్దసంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ధర్నా స్థలంలో ఏర్పాట్లు చేయాలని జగదీశ్‌రెడ్డి స్థానిక నేతలకు సూచించారు.

పల్లె బాటన పట్నం

చౌటుప్పల్ పట్టణంలో శుక్రవారం సాయంత్రం వాహనాల రద్దీ

హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

చౌటుప్పల్, జనవరి 10 : విద్యాసంస్థలకు శనివారం నుంచి సంక్రాంతి పండుగ సెలవులు ప్రారంభం కావడంతో హైదరాబాద్ నగరవాసులు పల్లెబాట పట్టారు. దాంతో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం వాహనాల రద్దీ నెలకొంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో 65 జాతీయ రహదారిపై కార్లు బారులు దీరాయి. మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఉన్న 16 ఫాస్టాగ్ బూత్‌లలో 10 బూత్‌లను తెరిచి వాహనాలను పంపిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచే వాహనాల రద్దీ మొదలు కాగా శని, ఆదివారాల్లో మరింతగా పెరిగే అవకాశం ఉంది. ప్రమాదాలు జరుగకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. రహదారి వెంట ప్రతి 30 కిలో మీటర్లకు ఒకచోట పెట్రోలింగ్ వాహనం, ఒక క్రేన్, అంబులెన్స్, 60 కిలోమీటర్లకు ట్రోయింగ్ వాహనం ఏర్పాటు చేశారు.

ఇంటెలిజెన్స్ ఉన్నతాధికారిపై అవినీతి అరోపణలు

- సిబ్బందితో అధిక వడ్డీ వసూళ్లు.. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు!
- మాట వినకపోతే వేధింపులు అంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న లేఖలు
- విచారణ జరుపుతున్న జిల్లా అధికారులు

నీలగిరి, జనవరి 10 : నల్లగొండ జిల్లా పోలీస్ శాఖలోని ఇంటెలిజెన్స్ ఉన్నతాధికారిపై అవినీతి అరోపణలు గుప్పుమంటున్నాయి. సదరు ఆఫీసర్ సిబ్బందితో అధిక వడ్డీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేయిస్తున్నారని, మాట వినని సిబ్బందిపై వేధింపులకు పాల్పడుతున్నాడని సోషల్ మీడియాలో సిబ్బంది రాసినట్లుగా ఉన్న లేఖలు చక్కర్లు కొడుతున్నాయి. నల్లగొండ జిల్లాకు 2017 సంవత్సరంలో డీఎస్పీ కేడర్ అధికారిగా పోస్టింగ్‌పై వచ్చిన ఆ అధికారి ఏడేండ్లుగా ఇక్కడే విధులు నిర్వర్తిస్తూ పదోన్నతులు పొంది బదిలీపై వెళ్లకుండా తన పలుకుబడిని ఉపయోగించి తిష్ఠ వేశారు. ఈ క్రమంలో అనేక అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. తన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు ఇతర పోలీస్ అధికారులు అవినీతికి పాల్పడుతున్నట్లు మూడు నెలలకు ఒక అధికారిపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు రిపోర్ట్‌లు ఇస్తూ తాను నిజాయితీ గల అధికారిగా వారిని నమ్మించి మన్ననలు పొందుతున్నారని లేఖలో పేర్కొన్నారు. నల్లగొండ, సూర్యాపేట రెండు జిల్లాలకు ఉన్నతాధికారిగా ఉంటూ ప్రభుత్వం నుంచి పోలీస్ సిబ్బందికి వచ్చే అలవెన్స్‌లు, ఇతర గ్రాంట్లను వారికి ఇవ్వకుండా కాజేస్తున్నట్లు ఆరోపించారు. ఇంటెలిజెన్స్ శాఖ నుంచి జిల్లాకు ప్రతి నెలా 35వేల రుపాయలు ఎస్ఆర్ రూపంలో రెండు జిల్లాలకు కలిసి రూ.70వేలు కేటాయిస్తుండగా, గత ఐదు సంవత్సరాల నుంచి సిబ్బందికి ఇవ్వకుండా ఆ అధికారే తీసుకుంటున్నట్లు సమాచారం. నాలుగు సంవత్సరాల క్రితం సదరు ఆఫీసర్‌కు బిడ్డ పుట్టడంతో పుట్టిన రోజు సందర్భంగా ఏటా నాలుగు తులాల చొప్పున ఇప్పటివరకు పదహారు తులాల బంగారం రెండు జిల్లాల సిబ్బంది నుంచి వసూలు చేసినట్లు లేఖలో ఆరోపించారు. ఆ అధికారి కుటుంబ సభ్యులు శ్రీశైలం మార్గంలోని అటవీ ప్రాంతంలో ఒక హోటల్‌ను, ఒక ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వారం రోజులకు ఒకసారి సిబ్బంది ద్వారా హోటల్‌కు కావాల్సిన సరుకులను నల్లగొండ నుంచే చేరవేస్తున్నట్లు ఆరోపించారు. పదోన్నతులు, పోస్టింగుల పేరుతో సిబ్బంది నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, వ్యక్తిగత అవసరాలు అంటూ ఎలాంటి కాగితమూ లేకుండా అప్పుగా తీసుకుని తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సిబ్బందితో సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయిస్తూ పెద్దఎత్తున లాభాలు గడించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలోనూ ఎక్కడికీ వెళ్లకుండా కేటాయించిన డీజిల్ కాకుండా అదనంగా డీజిల్ వాడినట్లు రసీదులు తెప్పించుకుని బంకుల నుంచి నగదు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల దసరా పండుగ సందర్భంగా సిబ్బందికి ప్రత్యేకంగా టార్గెట్లు పెట్టి మామూళ్లు వసూలు చేశారనే తెలిపారు. పైగా ఆ ఆఫీసర్ తల్లి ట్రాన్స్‌కో కార్యాలయంలో విధులు నిర్వర్తించకుండా నెలకు లక్షన్నర రూపాయల జీతం తీసుకుంటూ వేరొక మహిళను ఏడు వేల రూపాయల వేతనం ఇచ్చి డ్యూటీకి పంపిస్తున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వానికి సంబంధించిన కార్యాలయం భవనాన్నే సొంత ఇంటిగా మార్చుకుని ప్రతి నెలా హెచ్ఆర్ఏ రూపంలో కూడా ప్రభుత్వ సొమ్మును కాజేసినట్లు చెప్పుకొచ్చారు. ఇవే కాకుండా లేఖలో పేర్కొన్న అనేక అంశాలు పోలీస్ శాఖలో కలకలం రేపుతున్నాయి. వాటిపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు కూడా దృష్టి సారించి, విచారణ చేస్తున్నట్లు సమాచారం.

'వైకుంఠ' వైభవం

రామగిరి, జనవరి 10 : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయం, పాతగుట్ట, స్వర్ణగిరి వేంకటేశ్వరాలయం, నల్లగొండలోని సీతారామచంద్రస్వామి దేవాలయం, పానగల్ వెంకటేశ్వరస్వామి, మట్టపల్లి, వాడపల్లి, అర్వపల్లి, ఉండ్రుగొండ ఆలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. ఉత్తర ద్వారంలో స్వామిని దర్శించుకుని పులకించారు. వేడుకల్లో తిరుప్పావై ప్రవచనాలు, స్వామివారి పల్లకి సేవ వంటికి చేపట్టారు. మరోవైపు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో ఉదయం తొళక్కంతో అధ్యయనోత్సవాలను ప్రారంభించారు. స్వామివారిని గరుఢ వాహనంపైన వైకుంఠనాథుడిగా దర్శనమివ్వగా, మధ్యాహ్నం లక్ష్మీనరసింహస్వామి అలంకార సేవ నిర్వహించారు. సాయంత్రం విష్ణుమూర్తిని మత్స్యావతారంలో అలంకరించి ఊరేగించారు.

నల్లగొండ రామాలయంలో వైకుంఠ ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఖమ్మం-హైదరాబాద్ హైవేపై ఘోర ప్రమాదం

- ఐదుగురు వలస కూలీల దుర్మరణం
- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- 18 మందికి గాయాలు
- సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో ప్రమాదం

చివ్వెంల, జనవరి 10 : సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ఐదుగురు వలస కూలీలు దుర్మరణం చెందారు. మరో 18 మంది గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని కలహంది కోరాపూట్ జిల్లా బీసింగ్‌పూర్ తాలూకాకు చెందిన 32 మంది వలస కూలీలు అక్కడి నుంచి గుప్తా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు(సీజీ17కేఎస్7719)లో గురువారం హైదరాబాద్‌కు బయల్దేరారు. బస్సు శుక్రవారం తెల్లవారుజామున సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఐలాపురం శివారులోకి రాగానే ఖమ్మం–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆంగోతుతండా వద్ద 3:30 గంటల సమయంలో ఆగి ఉన్న ఇసుక లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సు అతివేగంతో ఉండడంతో కొంత దూరం వరకు అలాగే దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నలుగురు కూలీలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరొకరు చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయారు. 18 మంది గాయపడ్డారు. మృతులు రూపు హరిజన్(51), సుల హరిజన్ (46, మహిళ), సునామణి హరిజన్ (61, మహిళ), ప్రత్యూష్ ప్రభాత్ హరిజన్ (17), బస్సు డ్రైవర్ సునీల్ గోర్డా(37)గా గుర్తించారు. రోహిత్, పింటూ బంజారా తీవ్రంగా గాయపడడంతో హైదరాబాద్ తరలించారు. మిగతా క్షతగాత్రులకు సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ప్రయాణికుడు తల్వాడా కనియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ మహేశ్వర్ తెలిపారు. ప్రమాద స్థలాన్ని డీఎస్పీ రవి సందర్శించి వివరాలు సేకరించారు.

ఆంగోతుతండా వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

బస్సు డ్రైవర్ మారాల్సి ఉన్నప్పటికీ..

ఒడిశా నుంచి బయల్దేరిన ట్రావెల్స్ బస్సుకు ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. బస్సు ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించే సమయానికి డ్రైవర్ మారాల్సి ఉంది. కానీ డ్రైవర్ మారలేదని, చాలాదూరం నుంచి ప్రయాణం చేయడం వల్ల ముందున్న లారీని గుర్తించలేకపోయాడని మిగతా కూలీలు చెబుతున్నారు.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం

ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వూరు నుంచి సంగారెడ్డికి ఇసుక లోడుతో వెళ్తున్న లారీ(టీఎస్ 05యూడీ 3699) టైర్ ఆంగోతుతండా వద్ద పేలింది. డ్రైవర్ అప్రమత్తమై లారీని రోడ్డుకు ఎడమ వైపున ఆపితే ప్రమాదం జరిగేది కాదని స్థానికులు చెబుతున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా కుడి వైపునే లారీని నిలిపాడని, బస్సు డ్రైవర్ గమనించకపోవడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లు ఎప్పటికో!

సాగుతున్న ఇంటింటి సర్వే

- సూర్యాపేట జిల్లాలో పూర్తికాని సర్వే
- జనవరి 15 నాటికీ కష్టమే
- ఎక్కువ మొత్తంలో రిజక్ట్ అవుతున్నాయని ప్రచారం

సూర్యాపేట, జనవరి 10 : ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టిస్తామని, అందుకు అయ్యే ఖర్చులో 5 లక్షల రూపాయలను దశల వారీగా లబ్దిదారులకు అందిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసింది. ఏడాది పాలన పూర్త య్యే సమయానికి పథకానికి రూపకల్పన చేసి ఇందిరమ్మ ఇండ్ల పేరుతో పథకానికి శ్రీకారం చుట్టింది. సంక్షేమ పథకాల కోసం ప్రజా పాలన పేరుతో దరఖాస్తులను స్వీకరించిన ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికకు విధివిధానాలను రూపకల్పన చేసింది. మొత్తంగా వచ్చిన దరఖాస్తులను మొబైల్ యాప్ ద్వారా పరిశీలించింది. సూర్యాపేట జిల్లాలో 3,09,062 మంది కొత్త ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోగా, ఈ నెల 8 నాటికి జిల్లా వ్యాప్తంగా 2,90,336 దరఖాస్తులను సర్వే చేశారు. జనవరి ఒకటి నాటికే సర్వే పూర్తి చేయాల్సి ఉండగా, ఇంకా సాగుతూనే ఉంది. సంక్రాంతి పండుగ తరువాతే సర్వే పూర్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో 26 మండలాల పరిధిలోని 475 గ్రామ పంచాయతీలు, వాటి ఆవాసాలతోపాటు 5 మున్సిపాలిటీల్లో సర్వే చేస్తున్నారు. మొత్తం 3,09,062 దరఖాస్తులు రాగా, 5 మున్సిపాలీల్లో 58,377 దరఖాస్తులు అందాయి. మిగిలిన 2,50,685 దరఖాస్తులు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చాయి. గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, కొన్నిచోట్ల జూనియర్ అసిస్టెంట్ల ద్వారా సర్వే చేయిస్తున్నారు. మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు, ఆర్పీలు చేస్తున్నారు. వీరు క్షేత్ర స్థాయిలో యాప్‌లో అడిగిన వివరాలను నమోదు చేస్తున్నారు. సర్వే అనంతరం ప్రభుత్వం నిబంధనల ప్రకారం వడపోయనున్నారు. అనంతరం అర్హుల జాబితాను విడుదల చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు పెద్ద ఎత్తున్న దరఖాస్తులు రిజెక్ట్ అవుతాయని క్షేత్రస్థాయి సిబ్బంది, సర్వేలో పాల్గొన్న వారు చెప్పుకొంటున్నారు. 30 శాతం కంటే ఎక్కువ మందికి ఇళ్లు వచ్చే అవకాశం లేదంటున్నారు.

జనవరి 8 నాటికి మండలాల వారిగా పూర్తి అయిన సర్వే వివరాలు

మండలం	దరఖాస్తుల సంఖ్య	సర్వే పూర్తయినవి	మండలం	దరఖాస్తుల సంఖ్య	సర్వే పూర్తయినవి
అనంతగిరి	9,053	8,776	మోతె	13,714	12,956
ఆత్మకూర్(ఎస్)	15,315	15,256	మునగాల	13,072	12,682
చిలుకూరు	11,716	10,894	నడిగూడెం	8,784	7,517
చింతలపాలెం	10,186	9,741	నాగారం	8,797	8125
చివ్వెంల	10,644	9,842	నేరేడుచర్ల (అర్బన్)	3,370	3,119
గరిడేపల్లి	17,410	16,380	నేరేడుచర్ల	7,239	7,163
హుజూర్‌నగర్	7,377	6,986	నూతనకల్	10,708	9,515
హుజూర్‌నగర్(అర్బన్)	8,739	8,348	పాలకీడు	7,983	7,693
జాజిరెడ్డిగూడెం	9,070	8,640	పెన్‌పహాడ్	12,156	11,363
కోదాడ	10,947	10,244	సూర్యాపేట	11,179	10,417
కోదాడ(అర్బన్)	14,328	13,002	సూర్యాపేట(అర్బన్)	26,599	2,5811
మద్దిరాల	9,345	8,889	తిరుమలగిరి	7,052	6,611
మఠంపల్లి	14,442	13,738	తిరుమలగిరి (అర్బన్)	5,341	4,512
మేళ్లచెర్వు	11,936	10,466	తుంగతుర్తి	12,560	11,650

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ రూరల్,జనవరి 10 : రైతులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నదని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాము ప్రభుత్వం ఏర్పాటు చేసిన మరుక్షణమే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత కూడా 35 శాతం రుణమాఫీ కూడా చేయలేదన్నారు. పైగా పూర్తిస్థాయిలో రుణాలు మాఫీ చేసినట్లు తప్పుడు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. రైతుభరోసా ద్వారా ప్రతి రైతుకు ఎకరాకు సంవత్సరానికి రూ.15 వేలు ఇస్తానని హామీ ఇచ్చి, నేటికీ వాటి ఊసే లేదన్నారు. ఏడాది తర్వాత రూ.12 వేలు ఇస్తానని మాట మార్చారని విమర్శించారు. దాంతో రైతులు బ్యాంకుల్లో, బయట అప్పులు చేసి వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల రుణాలు పూర్తిస్థాయిలో కాక పోవడంతో వారికి కొత్త రుణాలు మంజూరు కాక బయట అధిక వడ్డీలకు అప్పులు తేవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అన్నదాతలు ఆగ్రహించక ముందే ఇచ్చిన హామీలు అమలు చేయాలని హితవు పలికారు. మాజీ సీఎం కేసీఆర్ స్వయాన రైతు కావడం వల్ల రైతుల సాగు బాధ తెలిసి వారికి అన్ని పథకాలు అందించడంతో పాటు సమయానికి పంట పెట్టుబడి అందించారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రివేంజ్ రాజకీయాలు మానుకొని రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని హితవు పలికారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి